

# ఉత్తరం కోసం....

* శ్రీ పేరిచర్ల రామకృష్ణరాజు *

(రచయిత)

పోస్టుమెన్ సుబ్బారావు రాకతో అగ్రహారమంతా చైతన్యవంత మవుతుంది. ఇనుప గేట్ల వింత చప్పుళ్ళు హోరు మృదంగాలవుతాయి.

'సుబ్రావ్! ఫలానా పత్రికనుండి కాంప్లిమెంటరీ రావాలోయ్... నువ్వు గానీ కొట్టేయట్లేదు కదా ?'

'భలేవారే సార్ !'

'మనియార్డరు పంపించమని కబురు చేసి వారం రోజులు అయ్యింది. ఇంతవరకూ రాలేమిటి?'

'వస్తే మేము వుంచుకుంటామా, చెప్పండి?'

'మా ఆవిడ కాన్పుకెళ్ళింది ఇంతవరకూ లెటర్ వ్రాయలేదు. త్వరగా న్యూస్ తీసుకు రావయ్యా! మగబిడ్డయితే నీకు స్వీట్ యిస్తా.'

ఇలాంటి పలుకరింపులు, చిర్నవ్వుల జవాబులు సుబ్బారావుకి రోజూ మామూలే! ఎదుటివారు కోపగించినా, నవ్వుకున్నా, చిర్రుబుర్రులాడినా, వచ్చిన ఉత్తరాల్ని, మనియార్డర్లని, కాంప్లిమెంటరీల్ని, చిరునవ్వుతో అందించడము సుబ్బారావులో ఉన్న సిన్సియారిటీకి నిదర్శనము. అందుకే సుబ్బారావు ప్రత్యేక వ్యక్తిగా ఎదుటివారికి కన్పించడు.

లెటర్స్ అందించి వీధి మలుపు తిరుగుతుంటే వినిపించింది.

'బాబూ! మా అబ్బాయి ఉత్తరం వ్రాశాడా? ఎన్ని రోజులయ్యిందో వాడు ఉత్తరం వ్రాసి...'

బామ్మగారి గొంతులో జీరాడే విషాదం...కళ్ళల్లో దిగులు...ఉత్తరం కోసం సుబ్బారావుని ప్రశ్నించని రోజు లేదు. వీధి మలుపులో పాడుబడిన పాత కాలం నాటి పెంకుటిల్లు బామ్మగారి నివాసం... యుద్ధములో శిథిలమైన కోటలా వుంది.

సుబ్బారావు తన సర్వీసులో అందరికీ లెటర్స్ అందించాడు. కానీ బామ్మగార్కి తన చేతుల మీదుగా ఒక్కటీ అందించలేక పోయాడు.

మర్నాడు మామూలుగానే అందరికీ లెటర్స్ అందించాడు సుబ్బారావు.

వీధి మలుపులో శిథిలమైన యిల్లు...గుమ్మంలో బామ్మగారు ఎప్పుడూ లేంది ఆ రోజు సైకిలెక్కి అడ్డు పడుతూ 'నాకు ఉత్తరం కావాలి. మా అబ్బాయి వ్రాసిన ఉత్తరాల్ని నువ్వే దాచేస్తున్నావ్.' హిస్టీరియా వచ్చినట్లుగా ఊగి పోయింది ఆమె.

ఖంగు తినడం సుబ్బారావు వంతయ్యింది.

'మీ అబ్బాయి నుండి ఉత్తరం వస్తే...మీకు ఇవ్వకుండా దాచుకుంటున్నా బామ్మగారూ!' జాలిగా అన్నాడు

'నాకు ఉత్తరం కావాలి' ఈ సారి ప్రాధేయ పూర్వకమైన అర్థింపు - ఎప్పుడూ లేంది సుబ్బారావు

With best compliments from :

Phone : 49165 Resi : 33929 Tel : "SANTHI STAR"

**Santhi Diamonds**

Prop : B. N. K. KANNAN & SONS

37, Big Sowrastra Street, TIRUCHIRAPALLI - 620 008

శాంతి వజ్రములు

మేము అత్యుత్తమమైన బెర్లీన్ స్టార్ డబుల్ కటింగ్

శాంతి స్టార్ కమలములు మీ నగలకు అతి ప్రకాశాన్నిచ్చే రీతిగా

తయారిస్తున్నాము.

రసాయనిక వజ్రాలను తయారించుటలో

మా దొక ప్రత్యేకత.

కళ్ళు చెమర్చాయి.

ఆవిడ భారంగా నడుస్తూ - శిథిలమైన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

* * *

బామ్మగారికి ఒకే కొడుకు - శేఖరం.

తాతలనాటి నుండి అంతా వ్యవసాయమే చేసుకుంటున్నారు. శేఖరం కూడా వ్యవసాయమే... పూర్తిగా మట్టిని నమ్ముకున్న మనిషి...మట్టినుండి బంగారము పండించే తెలివి!

శేఖరానికి ఒకే కొడుకు.

మారుతున్న కాలానికి ప్రతీకగా కొడుకును చదివించాలనుకున్నాడు శేఖరం.

మారుమూల పల్లెలో చదువు రావడము కష్టం. అందుకే భూపయ్య అగ్రహారము వచ్చి అక్కడ కాన్వెంటులో చేర్పించాడు శేఖరం.

ప్రతి రోజు తనే వెళ్ళి వ్యవసాయము చూసుకు వచ్చేవాడు.

మనవడికి తోడుగా బామ్మగారు.

వరిచేలు కోతకు వచ్చే సమయములో విపరీతమైన వర్షం వచ్చి చేతికందిన పంట మట్టిపాలు అయ్యింది.

ఆ తరువాత వరుసవా—

అతి వృష్టి...

అనా వృష్టి...

అప్పులు పెరిగాయి.

కొడుకు చదువు ఆగిపోయింది.

ఇల్లు శిథిలమయ్యింది.

శేఖరం వర్గారీన్ని 40 సంవత్సరాలకే వృద్ధాప్యపు చిహ్నాలు అందుకున్నాయి

ఇంత కాలం ఎంతో ప్రత్యాన్ని నిలుపుకున్న వంశం...కూలి పోతున్నందుకు బామ్మ వ్యథ.

నిరాశా-నిస్పృహలతో శేఖరం ఓ నిర్ణయానికి వచ్చాడు.

'అమ్మా...పొలం అమ్మేసి, అప్పులు తీర్చి

ఎక్కడికైనా వెళ్ళిపోదాము.'

బామ్మగారు ఎలాంటి జవాబు యివ్వలేదు.

చాలా సేపు భయంకర నిశ్శబ్దము తాండవించింది.

మళ్ళీ తనే అన్నాడు. 'ఉన్న పొలం అమ్మేసి, తుంగభద్రలో ఐదెకరాలు వస్తుంది. అక్కడ బాగు పడితే - మళ్ళీ ఇక్కడికే రావచ్చు.'

చెబుతున్నాడే గానీ, ప్రకాశం కళ్ళు అప్పటికే తడయ్యాయి.

'నేను రాలేను. ఇక్కడే వుండి పోతాను రేపో-మాపో పోయేదాన్ని అక్కడ చావడము కంటే - పోవడమే మంచిది. ఇల్లు పాడుబడినా కృష్ణా-రామా అనుకుంటూ ఇందులోని గడిపేస్తాను. అక్కడ బాగుపడి ఎలాగూ వచ్చేది యిక్కడికే కదా! ఇక్కడే వుండి పోతాను.'

పొలం అమ్మి తల్లి పేర పాతిక వేలు బాంకులో వేసి, తన కొడుకుతో సహా వెళ్ళిపోయాడు శేఖర్.

ఆ తరువాత మళ్ళీ కొడుకు రాలేదు.

కొడుకునుండి ఉత్తరము రాలేదు.

ఉత్తరము కోసం ఎదురు చూడని రోజు లేదు.

*     *     *

చాలా రోజుల తరువాత బామ్మగారి పేర్న ఉత్తరము వచ్చింది.

సుబ్బారావుకి చాలా ఆనందముగా వుంది.

తొలిసారిగా తన చేతుల మీదుగా బామ్మగార్కి ఉత్తరం అందజేయబోతున్న అనుభూతి.. సుబ్బారావుకి అహ్లాదమనిపించింది. బామ్మగారి కళ్ళలో వెలుగు చూడాలి.

ఆమె బోసి నవ్వుని చూడాలి. ముఖములోని అమాయకత్వము చూడాలి. తను లెటర్ అందిస్తే-ఆమె ఆనందానికి అవధులు వుంటాయా? నే పద్యాన్ని ముందుగానే వూహించుకుంటున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు మనస్తత్వం కాకపోయినా, బామ్మ


With the best compliments from :

**Sri Kandhan Industrials**

--: Manufacturers of :--

ART SILK CARPETS COTTON CARPETS & FAST COLOUR BEDSHEETS

Post Box No. 68, Behind Royal Theatre,

B H A V A N I - 638 301 (Tamil NADU)

Phones : Off : 21852, 21373 Fact : 21854

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు చాలా ప్రసిద్ధమైనది.

వాడిన ప్రతి వారూ పదే పదే ఆర్డరిస్తున్నారు.

మా ప్రతినిధిగా వుండేవాళ్ళు మంచి లాభము పొందుచున్నారు.

ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

గారి ఉత్తరం చదవా లనిపించింది. చదవటము నేరమని తెలుపు. అయినా చదవాలనుకున్నాడు. బహుశా ఇదంతా బామ్మగారి మీద అభిమానము కావచ్చు.

'బామ్మ గారిక్కి,

ఇక్కడ రెండు సంవత్సరాలుగా వర్షములు లేక పోవడం వల్ల, పంటలు పండక పోవడం వల్ల, అప్పులు పెరగడము వల్ల మీ అబ్బాయి శేఖర్ కుటుంబసమేతముగా పురుగుమందు తాగి, ఆత్మ హత్య చేసుకున్నారు...'

సుబ్బారావుకి ఇక చదవాలనిపించలేదు. గుండె బరువెక్కింది.

కళ్ళ వెంట నీళ్ళు వచ్చాయి.

ఎంతో ఆతృతతో నును ఇవ్వాలనుకున్న ఉత్తరము ఇదా...?

దీన్ని ఆమె చేతికి ఎలా అందించటము?

మనసు మూగగా రోధించింది.

అయినా తప్పదు...చిర్నవ్వయినా, విషాదమైనా, సమానముగా వాళ్ళకి అందించమే తన విధి!

అయినా ఎవరో ఉత్తవానికి తను కలత చెందట మెందుకు?

ఆవిడకూ, తనకూ ఏమిటి బంధము?

ఉత్తరము ద్వారా నిజము తెలిస్తే... ఆవిడ తట్టుకో గలదా?

చదవటము వచ్చా—లేక తనచేత చదివిస్తుందా?

బామ్మగారి పట్ల జాలి - మరింత పెరిగింది.

ఆలోచిస్తూ వీధి మలుపు తిరిగాడు.

అదే పాడుబడ్డ యిల్లు...కోటలా గాంభిర్యముగా వుంది.

ఆశ్చర్యం...!

ఎప్పుడూ ఎదురొచ్చే బామ్మగారు ఎదురు రాక పోవడము వెతిలిగా వుంది.

సుబ్బారావు సైకిల్ దిగాడు.




# కథాంజలి

(చక్కని కథల మాస పత్రిక)

స్థాపితం. 1938

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | ... | వెల | 1.00 |
| సంవత్సర చందా | ... | వెల | 25.00 |

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్‌బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును.

కథాంజలి

నెం. 7/1, జవహర్ వీధి,

కె కె. నగర్ (వెస్ట్)

మదరాసు - 600 078


నెమ్మదిగా తలుపు తట్టాడు.

అప్రయత్నముగా తెరుచుకున్నాయి.

'బామ్మగారూ! మీకు ఉత్తరము...'

ఉలుకూ-పలుకూ లేదు.

'ఏమిటి...ఎంత పిల్చినా ఆమె మంచము మీద నిద్ర పోతూనే వుంది.

సుబ్బారావు సంశయిస్తూ దగ్గరకు వెళ్ళాడు.

'బామ్మగారూ...ఉత్తరం!

మళ్ళీ మౌనమే ప్రతిధ్వనించింది.

ఆవిడ నుదుటిమీద చెయ్యి ఆన్చాడు.

చల్లగా తగిలింది.

సుబ్బారావు చేతిలోంచి ఉత్తరము జారి పోయింది.